# ఊరటనిచ్చిన తీర్పు



స్థానిక ఎన్నికల ఓటర్ల జాబితాలో అవకతవకలున్న దృష్ట్యా ఎన్నికలు నిలుపు చేయాలంటూ హైకోర్టు  ఏకసభ్య ధర్మాసనం ఇచ్చిన తీర్పుతో ఖంగుతిన్న రాష్ట్ర ప్రభుత్వానికి ఊరట లభించింది. ఎన్నికలు నిర్వహించుకోవచ్చునంటూ హైకోర్టు గురువారం తీర్పు ఇచ్చింది.   తొలుత ఏకసభ్య ధర్మాసనం ఇచ్చిన తీర్పు నేపథ్యంలో అసలు నోటిఫికేషన్ విడుదలైన తర్వాత ఎన్నికలు నిలుపుచేయడం న్యాయ పరంగా సాధ్యమేనా అన్న వాదోపవాదాలు చెలరేగాయి.

ఓటర్ల జాబితాలో అక్రమాలు, అవకతవకలు ఈసారి అసాధారణ స్థాయిలో చోటుచేసుకున్నాయన్న వార్తలే అసలీ పరిణామాలకు మూలం. ఓటర్ల జాబితాలో అవకతవకలపై సుమారు పది సంవత్సరాలుగా వివాదాలు నడుస్తునే ఉన్నాయి. ఇటువంటి వివాదాలలో రాష్ట్రవ్యాప్తంగా వార్తలలోకి మొట్టమొదట ఎక్కింది నరసరావురావుపేట నియోజకవర్గం. అప్పట్లో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో  తెలుగుదేశం పార్టీకి పట్టు ఉన్న కొన్ని గ్రామాలలో మరణించినవారి పేర్లు, అయిదారేళ్ళ పిల్లల పేర్లు ఓటర్ల జాబితాలో కనిపించాయి.

అది బయటపడక ముందు నుంచే ఆ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు  పెద్ద ఎత్తున ఆరోపణలు చేస్తూ వచ్చారు. ఆ తర్వాత జరిగిన ఎన్నికలలో ఇటువంటి ఆరోపణలు సాధారణమైపోయాయి. రిగ్గింగ్   చేసే దశ కంటే ముందే ఎన్నికల ఫలితాలను అనుకూలంగా మలుచుకునే ఆలోచనల ఏదైనా ఉందా అని రాజకీయ నాయకులు చేసిన అన్వేషణలో బయటపడిన తాజా ఎత్తుగడ- ఓటర్ల జాబితాలో అనుకూల మార్పులు చేసుకోవడం. అప్పట్లో ఇదంతా జరిగిన గుంటూరు జిల్లాలోని నాదెండ్ల మండలం నుంచీ ఎన్. శేఖర్ అనే వ్యక్తి ఇప్పుడు కోర్టులో పిటిషన్ దాఖలు చేయడం గమనించవలసిన విషయం.

సుమారు పదేళ్ళ క్రితం ఒక నియోజకవర్గంలో జరిగిన ఆ ప్రయోగం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా అమలయ్యిందన్నమాట.రాష్ట్ర ప్రభుత్వానికి గురువారం హైకోర్టు ఇచ్చిన తీర్పు ఊరటనిస్తే ఇచ్చి ఉండవచ్చు కానీ తమ  ఓట్లు గల్లంతయ్యాయని గగ్గోలు పెడుతున్న వారి మాటేమిటి?